క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన రత్నంపేట యువకులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న యువకులు

బోయినపల్లి: మండలంలోని రత్నంపేట గ్రామానికి చెందిన ఆర్య క్షత్రియ సంఘం సభ్యులు పలువురు శుక్రవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను కలిశారు. గ్రామంలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి రూ.4 లక్షలు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించగా, నిధుల మంజూరుకు హామీ ఇవ్వడంతో ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గ్రామానికి చెందిన కొడగాని అశోక్, గురజాల కోటి, ల్యాద రాంబాబు, గొండ సుధాకర్, సోలంకి శ్రీనివాస్, విజేందర్, కందారపు శ్రీనివాస్, కిషన్‌రావు ఉన్నారు.

నిర్మాణపనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని 21వ వార్డులో మహిళా కమ్యూనిటీ హాల్ అదనపు అంతస్తు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ శుక్రవారం పూజా కార్యక్రమం నిర్వహించారు. పట్టణాభివృద్ధికి పాలకవర్గం ఎంతగానో కృషి చేస్తుందని, ఇందులో భాగంగానే రూ.15 లక్షలతో వార్డులో కమ్యూనిటీ భవన్ నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ రవి, నాయకులు పాల్గొన్నారు.

మినీ వాటర్‌ప్లాంట్ ప్రారంభం



మాట్లాడుతున్న వికాస్‌రావు

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు అయ్యోరుపల్లిలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను డా.చెన్నమనేని వికాస్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కలుషిత నీటితో టైఫాయిడ్, కామెర్లు, జ్వరాలకు గురవుతారన్నారు. స్వచ్ఛమైన నీరు తాగడం వల్ల అనేక రోగాలు దూరమవుతాయని ప్రతిమ ఫౌండేషన్ నిర్వాహకులు అన్నారు. ప్రజల అవసరాల కోసమే వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని, రాజకీయాల కోసం కాదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, వంగల దివ్య, మాజీ సర్పంచులు అంజయ్య, వడిజె మల్లయ్య, రాజమల్లయ్య, కుల సంఘ పెద్దలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో సిబ్బంది కొరత

- వెక్కిరిస్తున్న ఖాళీలు
- పనిబ్బందికి అదనపు పనిభారం
- ముందుకుసాగని పనులు



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

తంగళ్లపల్లి: మండలంలో ఉపాధి హామీ పనుల అమలులో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఉపాధిహామీ పనులను ముందుండి నడిపించాల్సిన ఫీల్డు అసిస్టెంట్, ఉపాధి హామీలో బిల్లుల చెల్లింపు, పనుల గుర్తింపు, పరిశీలన చేయాల్సిన టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల ఖాళీలు ఉండడంతో నిర్వహణ భారంగా మారింది. ఉన్నవారే తలకుమించిన భారాన్ని భుజాలమీద వేసుకుని అదనపు పనులు చేయాల్సి వస్తోంది. దీంతో ఉద్యోగులు పని ఒత్తిడికి గురవుతున్నారు. ఇద్దరు చేయాల్సిన పనులు ఒక్కరే చేయాల్సి రావడంతో తలలు పట్టుకుంటున్నారు.

30 గ్రామాలకు ముగ్గురే టీఏలు

మండలంలో మేజర్ గ్రామపంచాయతీ తంగళ్లపల్లిని కలుపుకుని 30 గ్రామాలున్నాయి. గతంలో మండలంలో ఉపాధిహామీ పనుల పరిశీలన, బిల్లుల చెల్లింపు చేసేందుకు ఐదుగురు టెక్నికల్ అసిస్టెంట్లు ఉండేవారు. ఒక్కొక్కరు ఆరు గ్రామాల చొప్పున 30 గ్రామాల ఉపాధిహామీ పనులు చేసేవారు. ప్రస్తుతం కేవలం ముగ్గురు టీఏలు మాత్రమే ఉండడంతో ఒక్కొక్కరు 10 గ్రామాలను చూడాల్సి వస్తోంది. అదనంగా నాలుగు గ్రామాల పని భారం పడింది. ఇదిలా ఉండగా 30 మంది ఉండాల్సిన ఫీల్డు అసిస్టెంట్లకు గాను 20 మంది మాత్రమే ఉండగా 10 గ్రామాలకు ఫీల్డు అసిస్టెంట్లు కరువయ్యారు. దీంతో పనిభారం పంచాయతీ కార్యదర్శులపై పడుతోంది.

భర్తీ చేయకుంటే ఇబ్బందే

ఉపాధిహామీ పనులు ఎటువంటి ఇక్కట్లు లేకుండా సజావుగా సాగాలంటే పర్యవేక్షించాల్సిన అధికారుల పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఐదుగురు టెక్నికల్ అసిస్టెంట్లకు ఒకరు 6 నెలలకు పైగా సెలవుపై వెళ్లి ఇప్పటివరకు విధుల్లో చేరలేదు. మరొకరు ఇల్లంతకుంట మండలానికి డెప్యుటేషన్‌పై వెళ్లారు. దీనికితోడు ఉన్న ముగ్గురు టీఏలలో ఒకరికి వేములవాడ మండలం అదనపు బాధ్యతలు అప్పగించారు. అలా అని జేఈని కూడా వదల్లేదు. అతనికి కూడా మరో రెండు మండలాల బాధ్యతలు అప్పగించడంతో ఎక్కడా కుదురుగా పనిచేసే పరిస్థితి లేకుండా పోయింది. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఖాళీగా ఉన్న 10 ఫీల్డు అసిస్టెంట్ పోస్టులు, 2 టీఏ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. డిప్యుటేషన్‌లను రద్దు చేసి ఎక్కడి వారికి అక్కడే పోస్టింగ్ ఇవ్వాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ పని నేనే చేస్తున్నా



పాపయ్యపల్లె గ్రామపంచాయతీ పరిధిలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఆ విధులు కూడా పంచాయతీ కార్యదర్శిగా నేనే చేయాల్సి వస్తోంది. అదనపు బాధ్యతల మూలంగా పనిభారం పెరుగుతోంది. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుంటే బాగుంటుంది. – కవిత, పంచాయతీ కార్యదర్శి పాపయ్యపల్లె

ముగ్గురం 10 గ్రామాలు చూస్తున్నాం



మండలంలో 30 గ్రామాలు ఉండగా ప్రస్తుతం ముగ్గురం మాత్రమే టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నాము. ఒక్కొక్కరం 10 గ్రామాల ఉపాధిహామీ పనులు చూస్తున్నాం. ఖాళీగా ఉన్న రెండు పోస్టులలో కొత్తవారిని నియమిస్తే పనిభారం తగ్గుతుంది. – మనోహర్ టెక్నికల్ అసిస్టెంట్

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల ఖాళీలు ఉన్న మాట వాస్తవమే. కొత్త వారిని నియమించే అధికారం జిల్లా అధికారులకు మాత్రమే ఉంది. ఖాళీల విషయం ఉన్నతాధికారులకు నివేదిస్తాం. – పి.లచ్చాలు ఎంపీడీవో తంగళ్లపల్లి

రెండోరోజు సమ్మె





ఎల్లారెడ్డిపేటలో కార్మికులకు కేకే సంఘీభావం

వేములవాడ: ఉద్యమాల గద్దెపై..
11వ పీఆర్సీ అమలు చేస్తూ తమ వేతనాలు పెంచాలని కోరుతూ గ్రామపంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ చేపట్టిన సమ్మె శుక్రవారం రెండోరోజుకు చేరుకుంది. వేములవాడలో సీఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం అశోక్ పాల్గొన్నారు.
ఎల్లారెడ్డిపేటలో సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, ముస్తాబాద్‌లో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బుర్ర రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తిరుపతి కార్మికులకు సంఘీభావం తెలిపారు.
కోనరావుపేటలో సీఐటీయూ, లైవ్(లంబాడీ హక్కుల ఐక్యవేదిక) జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, బానోత్ నరేశ్‌కుమార్, ఇల్లంతకుంటలో గ్రామపంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య సంఘీభావం తెలిపారు.
బోయినపల్లిలో సీపీఎం నాయకులు గురజాల శ్రీధర్, మండల అధ్యక్షుడు అక్కెనపెల్లి లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.
చందుర్తిలో పంచాయతీ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.
వీర్నపలి మండల కేంద్రంలో సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య మద్దతు తెలిపారు.
తంగళ్లపల్లిలో సమ్మెకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మద్దతు తెలిపారు. గ్రామపంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, కార్యదర్శి లింగంపల్లి కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లిలో మాట్లాడుతున్న కోడం రమణ

అటెన్షన్ ప్లీజ్



రోడ్డు పక్కన ప్రమాదకరంగా గుంత

ఎల్లారెడ్డిపేట: మండలం నారాయణపూర్ గ్రామానికి వెళ్లే రహదారిలో రోడ్డు పక్కనే ఉన్న గుంత ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వచ్చి వెళ్తుంటాయి. రాత్రివేళ అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల బండలింగంపల్లికి చెందిన రాజం, న్యాత సురేశ్ ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో బయటపడ్డారు. రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చివేయాలని అధికారులను కోరిన పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతను పూడ్చివేసి మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శ్రీనివాస్, పీఆర్ డీఈఈ, సిరిసిల్ల
ఫోన్ నంబర్: 94417 39444

ప్రధాని మోది దిష్టిబొమ్మ దహనం





సిరిసిల్ల, ముస్తాబాద్‌లో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్లటౌన్: ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ అనర్హతపై స్టే కోసం వేసిన పిటిషన్‌ను గుజరాత్ హైకోర్టు తిరస్కరించినందుకు నిరసనగా శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో ప్రధాని మోది దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. సిరిసిల్లలో పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజాదరణను ఓర్వలేకనే అక్రమ కేసులు పెడుతుందన్నారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చుక్క శేఖర్ పాల్గొన్నారు.
ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య నాయకులు గౌస్, లింగంగౌడ్, లక్ష్మారెడ్డి, శ్రీని వాస్‌రెడ్డి, బుచ్చగౌడ్, బాబు, రాజు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేటలో..

ముస్తాబాద్: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కొండం రాజిరెడ్డి పాల్గొన్నారు.
గంభీరావుపేట: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, ప్రభాకర్, నర్సింలు, రాజుగౌడ్, లచ్చయ్య పాల్గొన్నారు.
తంగళ్లపల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, నాయకులు పాల్గొన్నారు.

కూనంనేని అరెస్టును నిరసిస్తూ..



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

సిరిసిల్లఅర్బన్: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రెడ్ కూనంనేని సాంబశివరావు అక్రమ అరెస్టును నిరసిస్తూ సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ వద్ద ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు మాట్లాడుతూ రాష్ట్రాల విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి ఇప్పటికి నేరవేర్చలేదన్నారు. దీనిని నిరసిస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సాంబశివరావును అరెస్టు చేయడం సరికాదన్నారు. హామీలను నెరవేర్చకుండా తెలంగాణ పర్యటనకు రావడం సిగ్గు చేటని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు పంతం రవి, కడారి రాములు, మీస లక్ష్మణ్, సోమ నాగరాజు, రాజమణి, గంగవ్వ, మహేశ్వరి, మమత, సావిత్రి, రాజమణి, కిషోర్ పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



మృతిచెందిన అజయ్‌కుమార్

సిరిసిల్లఅర్బన్: మండలంలోని సారంపెల్లి గ్రామంలో సిరిసిల్ల–సిద్దిపేట ప్రధాన రహదారిపై బీహార్ రాష్ట్రానికి చెందిన అజయ్‌కుమార్(26) అనే యువకుడు మృతి చెందాడు. రోడ్డు ప్రక్కన అనుమానస్పద స్థితిలో పడి ఉన్నట్లు గుర్తించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పాముకాటుతో ఎద్దు మృతి



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన ఒల్లాద్రి సత్తిరెడ్డికి చెందిన దుక్కిటెద్దు శుక్రవారం పాముకాటుతో ప్రాణాలు వదిలింది. శుక్రవారం పొద్దంతా దుక్కి దున్నిన సత్తిరెడ్డి పొలం వద్దనే కట్టేసి ఇంటికొచ్చి సాయంత్రం వెళ్లి చూడగా ఎద్దు నురుగలు కక్కి చనిపోయి ఉంది. ఎద్దు మృతిని తట్టుకోలేక రైతు కుటుంబీకులు బోరున విలపించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు ఎల్లమ్మ ఆలయ సమీప రహదారి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. రగుడు ఎల్లమ్మ ఆలయం సమీపంలోని డివైడర్ వద్ద ట్రాక్టర్, ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

తంగళ్లపల్లి: రైతన్నలు ఆయిల్ పామ్ మొక్కలు నాటి మంచి లాభాలను పొందాలని ఎంపీపీ పడిగెల మానస అన్నారు. మండలంలోని అంకుషాపూర్ గ్రామంలోని రైతు అంచ బాల్‌రెడ్డి పొలంలో శుక్రవారం ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ మొక్కలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లవ్వ, ఎంపీటీసీ కుంటయ్య, ఉద్యానవన శాఖ ప్రవంతి, రైతులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటుకు భూమిపూజ
ఇందిరమ్మకాలనీ గ్రామపంచాయతీ నిధులతో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో శుక్రవారం బోరు ఏర్పాటుకు ఎంపీపీ పడిగెల మానస, సర్పంచ్ బైరి శ్రీవాణి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సిలివేరి ప్రసూన, ఉపసర్పంచ్ సాయిరాం, ప్రిన్సిపాల్ శకుంతల పాల్గొన్నారు.



అంకుషాపూర్‌లో మొక్క నాటుతున్న ఎంపీపీ

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేత
కోనరావుపేట: మండలం బావుసాయిపేట గ్రామం నుంచి కోనరావుపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు వెళుతున్న వంద మంది విద్యార్థులకు సర్పంచ్ కెంద గంగాధర్, ఉపసర్పంచ్ చొక్కాల దేవరాజు ఆధ్వర్యంలో ఉచితంగా బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. డిపో మేనేజర్ మురళీకృష్ణ, పీఆర్‌వో శ్రీనివాస్‌యాదవ్, వీపీవో మోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు
సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల వికాస తరంగిణి, ప్రజ్ఞా వికాస్ కోఆర్డినేటర్ పెద్ది రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక శ్రీ కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో సమాజాభివృద్ధిలో గురువుల పాత్ర అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, వికాస తరంగిణి కోఆర్డినేటర్ పెద్ది శ్రీనివాస్ పాల్గొన్నారు.

13న బీఎస్పీ జిల్లా కార్యకర్తల సమావేశం
తంగళ్లపల్లి: బీఎస్పీ ఆధ్వర్యంలో ఈ నెల 13న సిరిసిల్ల పట్టణంలో జరగబోయే జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని సిరిసిల్ల నియోజకవర్గ అధ్యక్షుడు లింగంపల్లి మధుకర్ కోరారు. మండలంలోని పద్మనగర్ గ్రామంలో మండల అధ్యక్షుడు గుండు ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మెరుగు రాజు, టౌన్ అధ్యక్షుడు తడక భాను, చిట్టిపెల్లి నరేందర్, కిషన్, సగ్గుపాటి శంకర్, మెరుగు భాస్కర్, వెలగొండ కృష్ణ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత
కోనరావుపేట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండలంలోని నాగారం గ్రామానికి చెందిన వీఆర్ఏ సరేందర్ కుటుంబానికి ఆధ్యగోలి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గోలి మోహన్ రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత
వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని రుద్రవరం గ్రామంలో నేరెళ్ల పతికి రూ. 26 వేలు, అశోక్‌కు రూ.16 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు హరికృష్ణ అందజేశారు.

ఆర్థికసాయం
ఎల్లారెడ్డిపేట: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు గంట దుర్గయ్యగౌడ్ కుటుంబానికి గౌడ్స్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.10 వేల నగదు, నిత్యావసర వస్తువులను అందజేశారు. గౌడ సంఘం అధ్యక్షుడు గంట శ్రీనివాస్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట రహదారి పనులు జరుగుతున్నందున నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వెంకంపేట, పాతబస్టాండ్, సంజీవయ్యనగర్, ఆటోనగర్, అసిఫ్‌పుర, అశోక్‌నగర్, అనంతనగర్, అంబికానగర్, సర్దార్‌నగర్ తదితర ప్రాంతాలలో కరెంట్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



జెండావిష్కరణ చేస్తున్న నాయకులు

గంభీరావుపేట/వీర్నపల్లి: ఎమ్మార్పీఎస్ మాదిగ దండోర 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని గంభీరావుపేట మండలంలోని శ్రీగాధ, వీర్నపల్లిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జెండావిష్కరణ అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింప చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ కానాపురం లక్ష్మణ్, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత



సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

ముస్తాబాద్: మండలంలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ముగ్గురికి శుక్రవారం వాటిని అప్పగించినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రత్యేక పోర్టల్ ద్వారా పోయిన మొబైల్ ఫోన్లను కనిపెట్టడం జరుగుతుందన్నారు. సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వ్యక్తులు ఐఎంఈఐ నెంబర్లతో ఫిర్యాదు చేస్తే వాటిని కనిపెట్టి అప్పగించడం జరుగుతుందన్నారు.

ఎమ్మెల్సీ రమణకు పరామర్శ

వేములవాడ: ఎమ్మెల్సీ ఎలగందుల రమణ తండ్రి ఎల్.జీ.రామ్ ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబాన్ని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి శుక్రవారం జగిత్యాలకు చేరుకుని పరామర్శించారు.

పోచమ్మకు బోనాలు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని అనుపురం గ్రామంలోని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనంతో డప్పుచప్పుల్ల, బైండ్లోళ్ల ఆటపాటలతో పోచమ్మ ఆలయంకు చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో మహేశ్, రాజు, ఆగయ్య, సత్తయ్య, మల్లయ్య, ముత్తయ్య పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం



చెక్కులు పంపిణీ చేస్తున్న చైర్మన్ కృష్ణారెడ్డి

ఎల్లారెడ్డిపేట: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రాథమిక సహకార సంఘం పని చేస్తుందని సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. సహకార సంఘంలో శుక్రవారం 12 మంది రైతులకు రూ.67.10 లక్షల చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. రైతులు ఆర్థిక స్వావలంబన సాధించాలంటే వ్యవసాయంతో పాటు దాని అనుబంధ రంగాలైన డెయిరీ, గొర్రెలు, పట్టుపురుగులు, కోళ్లపెంపకం లాంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ జంగిటి సత్తయ్య, డైరెక్టర్లు వెంకట నర్సింహరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి కిశోర్‌కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వేములవాడరూరల్: మండలంలోని ఎదురుగట్ల గ్రామంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్య నిపుణురాలు నీరజ సర్పంచ్ కరుణాకర్, ధనలక్ష్మి, శ్రీలత,గ్రామస్తులు పాల్గొన్నారు.